క్లుప్తంగా

బాబ్జీ కుటుంబ సభ్యులను పరామర్శించిన దొరబాబు



గోలి బాబ్జీ కుటుంబ సభ్యులను పరామర్శించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామానికి చెందిన గోలి బాబ్జీ ఇటీవల మృతి చెందడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీలో చురుకైన పాత్ర పోషించే గోలి బాబ్జీని కోల్పోవడం బాధాకరమన్నారు. బాబ్జీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వల్లూరి పెదబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో కుమారా రామభీమేశ్వరస్వామి జన్మ నక్షత్రం ఆరుద్ర కావడంతో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామున అభిషేకాలు నిర్వహించారు. దేవేరి బాలాత్రిపుర సుందరి అమ్మవారికి శాకంబరి అలంకరణను పురస్కరించుకొని సాయంత్రం స్వామి వారిని పండ్లతో ప్రత్యేకంగా అలకరించారు.

హామీల బాండు మాటేమిటి బాబు!

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్
- కూటమి నేతల తీరును దుయ్యబట్టిన వైఎస్సార్ సీపీ నాయకులు
- పిఠాపురం మండల వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం



పిఠాపురం సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీతావిశ్వనాథ్



సామర్లకోట సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

పిఠాపురం: ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చారు.. వాటిని అమలు చేస్తామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రజలకు రాసిచ్చిన బాండులోని అంశాలన్నిటినీ గద్దెనెక్కిన తరువాత విస్మరించారని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్ విమర్శించారు. మీరిచ్చిన బాండు మాటేమిటి బాబు అంటూ వంగా గీతావిశ్వనాథ్ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పిఠాపురం మండల అధ్యక్షుడు అడపా రఘు అధ్యక్షతన బుధవారం పిఠాపురంలో నిర్వహించిన మండల వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె ప్రసంగించారు. బాండు ఇవ్వడమంటే పూర్తి ఆధారంతో అమలు చేస్తామంటూ హామీ ఇవ్వడమేనని ఆమె గుర్తు చేశారు. అలాంటి బాండు ఇచ్చిన కూటమి నేతలు అన్ని వర్గాల ప్రజలను నిలువునా నట్టేట ముంచారన్నారు. రెండేళ్లుగా రైతు భరోసా ఇవ్వలేదన్నారు. చివరకు కేంద్రం ఇచ్చే వాటా కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె విమర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటికీ చాలా మంది రైతులకు డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్నా ఇప్పటికీ మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను అమలు చేయలేదన్నారు. తల్లికి వందనంలో అనేక మంది అర్హుల పేర్లు తొలగించాలని అన్నారు.

మహిళలను ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

మహిళలను అన్ని విధాలా ఆదుకుని వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. పేదలకు ఆసరాగా నిలిచిన అనేక పథకాలను కూటమి ప్రభుత్వం నిలుదల చేసిందన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆమె అన్నారు. ప్రజల తరుపున వైఎస్సార్ సీపీ గళం విప్పి పోరాటం చేస్తుందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, కేసులు పెట్టి భయపెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్థినీడి సుజాత, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం, నాయకులు సైతన వర ప్రసాద్, కర్నీడి సత్యనారాయణ, బండి సుబ్బులు, జవ్వాది వాడపల్లి, ఎంపీటీసీ నానిబాబు, రాసంశెట్టి భవానీ, పెదపాటి రమేష్‌కుమార్, కీర్తి తమ్మయ్య, కూరాకుల విష్ణు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుభంద విభాగాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నేతలు

కూటమి మోసాలపై చర్చ జరగాలి

- వైఎస్సార్ సీపీ పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు
- పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- సామర్లకోటలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం

సామర్లకోట: కూటమి చేసిన మోసాలపై ప్రతి ప్రాంతంలోను చర్చ జరగాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక రైతు భవనంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ పట్టణ స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించడానికి గడపగడపకూ కార్యక్రమం నిర్వహించామని, దీనిలో భాగంగా నియోజకవర్గంలో 98 గడపలకు 97 గడపలను తిరిగామన్నారు. 13 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వలనే కూటమి నాయకులు బయటకు రాలేకపోతున్నారని, ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని తెలిపారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీని ఇప్పటికీ అమలు చేయలేమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఎన్టీఆర్, తరువాత వైఎస్ రాజశేఖరరెడ్డిని ఇప్పటికే ఎవరూ మరచి పోలేరన్నారు. ప్రతి పేద వాడు ఇంజినీరు, డాక్టరు కావాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని అనేక హామీలను అమలు చేశారన్నారు. ప్రస్తుత కూటమిలో బీసీ, ఎస్టీ, కాపు రుణాలు పార్టీ నాయకులనే వచ్చాయని ఆయన తెలిపారు. అమలు కాని హామీలతో పాటు ఈవీఎంలను టాంపరింగ్ చేసి అధికారంలోనికి వచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా సామర్లకోటలోనే ఏడు వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని తెలిపారు. అయితే ఏడాది పూర్తయినా ఒక్క ఇళ్ల పట్టా కూడా ఇవ్వలేదన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ సంతకాలు చేసి ప్రతి ఇంటికీ ఇచ్చిన బ్యాండ్లపై కూటమి నాయకులను నిలదీయాలన్నారు. పవన్ కల్యాణ్ హామీలు అమలు చేయిస్తామని చూస్తామని చెప్పి కనిపించచం లేదన్నారు. ఆయన స్వలాభం కోసం సినిమా టిక్కెట్టు రేటు రూ.600కు పెంచుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ అధ్యక్షత వహిస్తూ బాబు చేసిన మోసాలను ప్రతి వార్డులోను చర్చ జరగాలన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ ఆవేదన వ్యక్తం చేశారు. విషయాలను గమనించి కూడా పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దవులూరి సుబ్బారావు పార్టీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, రాష్ట్ర యూత్ సంయుక్త కార్యదర్శి కరణం భాను, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పుట్టా సూరిబాబు, నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు బీ.వెంకటరమణ, ఇరుసుమళ్ల సాయి, మాజీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, మాజీ సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీను, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించిన దొరబాబు, మహిళా నేతలు

పంచారామ క్షేత్రం భక్తులతో కిటకిట

- శాకంబరిగా బాలాత్రిపుర సుందరీదేవి
- నూకాలమ్మ ఆలయం నుంచి సారెతో ఊరేగింపు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని అమ్మవారు బాలాత్రిపుర సుందరి వద్దకు సారె తీసుకెళుతున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయం బుధవారం భక్తుల రద్దీతో కిటకిట లాడింది. ఆషాఢ మాసం, మాస శివ రాత్రి, స్వామివారి ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి శాకంబరిగా అలంరించారు. ప్రతి ఏడాది ఆషాడ మాసం మాస శివరాత్రి రోజున అమ్మవారిని శాకంబరిగా అలంకరణ చేయడం జరుగుతుంది. ప్రస్తుతం స్వామివారి జన్మనక్షత్రం కలిసి రావడంతో ఆలయంలోని బాలాత్రిపుర సందరీదేవి, సరస్వతీదేవి, మహిషాసురమర్ధిని అమ్మవార్లను కూరగాయలు, పండ్లతో అలంకరించారు. అమ్మవారి అలంకరణను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శాకంబరి అలంకరణను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం కూరగాయలతో అలంకరించారు. అదేవిధంగా స్వామివారిని కూడా కూరగాయలతో అలంకరణ చేశారు. ఆలయ నంది మండపం వద్ద ఆలయ నమూనాను కూరగాయలతో చేసిన అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది.

నూకాలమ్మ ఆలయం నుంచి సారె

పంచారామ క్షేత్రంలోని దేవేరి బాలాత్రిపుర సుందరి దేవికి గ్రామ దేవతగా పేరు పొందిన నూకాలమ్మ ఆలయం నుంచి సారె తీసుకొని వెళ్లారు. ఆషాఢ మాసం సారెను అమ్మవారికి తీసుకు వెళ్లడం అనవాయితీగా మారింది. వివిధ రకాల పిండి వంటలు, మిఠాయి, పండ్లు, పసుపు కొమ్ములు, చీరలు, జాకెట్టు ముక్కలు, గాజులతో ఏర్పాటు చేసిన సారే ఊరేగింపును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నూకాలమ్మ వారికి పూజలు చేసి ప్రారంభించారు. నూకాలమ్మ ఆలయం నుంచి రథం సెంటర్, షిర్డిసాయి బాబా మందిరం, గడియార స్తంభం, ఫ్లైఓవర్ బ్రిడ్జి, సుగర్ ఫ్యాక్టరీ, కాలిబాట వంతెన, మాండవ్యనారాయణ స్వామి ఆలయం నుంచి భక్తులు పంచారామ క్షేత్రంలోని అమ్మవారికి సారెను కోలాటం, బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పుల మధ్య తీసుకొని వెళ్లారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

లక్ష పసుపు కొమ్ముల నోము

ఆలయంలో మొదటిసారిగా ముత్తైదువులు లక్ష పసుపు కొమ్ముల నోమును నిర్వహించారు. భక్తులు తీసుకు వచ్చిన సారె, పసుపు కొమ్ములను ప్రత్యేక వేదికపై ఉంచి పంచారామ క్షేత్ర అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం నుంచి మహిళలకు పసుపు కొమ్ములు, జాకెట్టు ముక్కలు పంపిణీ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటరమణ, మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వర రావు, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో బాలాత్రిపుర సుందరి



శాకంబరిగా శ్రీలక్ష్మీదేవి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

శాకంబరిగా శ్రీమహాలక్ష్మి

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పిఠాపురంలో కొలువైయున్న శ్రీ శృంగేరి శంకర మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారు బుధవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం ముగింపులో భాగంగా పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారిని ఆలయ నిర్వాహకులు ఇంద్రగంటి వెంకటగోపాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని విశేషంగా వివిధ రకాల కాయగూరలతో పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు మండలం దుర్గాడలో శ్రీరామలింగేశ్వరస్వామిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో రైతులు పండించిన కూరగాయలతో ఏటా ఆషాఢమాసంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించడం ఆనవాయితీగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

28న వైఎస్సార్ సీపీ జిల్లాస్థాయి ఎస్సీ సెల్ సమావేశం

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నానిబాబు

పిఠాపురం: ఈనెల 28న కాకినాడలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ జిల్లాస్థాయి ఎస్సీ సెల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్ పిలుపు నిచ్చారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుల సమావేశంలో ఆమె పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డీజే సుధాకర్‌బాబు సూచనలతో జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో ఈనెల 28న కాకినాడ సూర్యకళామందిర్‌లో జిల్లాస్థాయి ఎస్సీ సెల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఎస్సీలకు జరుగుతున్న అన్యాయంపై నాయకులు చర్చించి భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల, పట్టణ, మున్సిపాలిటీ, గ్రామ, వార్డు స్థాయి ఎస్సీ నాయకులు సభ్యులు, కార్యకర్తలందరూ విధిగా హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పిఠాపురం నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెదపాటి రమేష్, వైస్ ఎంపీపీ శెట్టి బత్తిన నాని బాబు, ఉలవల భూషణం, పచ్చిమళ్ళ జ్యోతి, వర్ధినిడి సుజాత, బత్తిన రాజశేఖర్, పెదపాటి నాగేశ్వరరావు, వింత చంటి బాబు, ఆలపు సుధారాణి, పచ్చిమళ్ల అప్పలరాజు, కాలుకురస సునీల్ దత్, బోను దేవా జోయల్ సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణదాసు కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లి: పొన్నాడ గ్రామానికి చెందిన వడ్డీ కృష్ణదాసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత బుధవారం పరామర్శించి మృతికి గల కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాసరావు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, యాదాల శేఖర్, కారే కిరణ్, సాకా చిన్నబ్బాయి, కంబాల యకబ్, వడిగే కనకరాజు, కంబాల ధనరాజు ఉన్నారు.

దేవదాయ భూములను పరిరక్షించాలి




ఆందోళన చేస్తున్న గోర్స గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కొత్తపల్లి: అన్యాక్రాంతమైన ఆలయాల భూములను దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలంటూ మండలంలోని గోర్స గ్రామస్తులు కొమరగిరిలో ఉన్న దేవదాయ భూముల వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. గోర్సలో ఉన్న పురాతన సీతారామ ఆలయానికి సంబంధించిన భూములు సర్వే నంబర్ 121,122లో గల 19.92 ఎకరాలను కొంతమంది కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. ఇటీవల ఈ భూముల విషయంలో గ్రామస్తులు స్థానిక సచివాలయం వద్ద అధికారులను నిర్బంధించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద కూడా ఆందోళన నిర్వహించారు. గ్రామంలో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు. ఈ భూముల్లోకి ఏ ఒక్కరూ రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఇటీవల కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. అయినప్పటికీ పంటలు సాగుచేస్తున్న రైతులు వివాదాస్పద భూముల్లోకి వెళ్లి పనులు చేపట్టడంతో గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దేవుడు భూములను సాధించుకునే వరకూ పోరాటం ఆగదన్నారు. అవసరం అయితే గ్రామస్తులంతా కలసి భూముల వద్ద ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామన్నారు. పోలీసులు వచ్చి ఇరువర్గాల వారిని నచ్చజెప్పి పంపించారు. వివాదం పరిష్కారమయ్యే వరకూ భూముల వద్దకు ఏ ఒక్కరూ ప్రవేశించరాదని ఆదేశించారు. దేవుని భూమి రక్షించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని సర్పంచి రొంగల వీరబాబు అన్నారు. ఆందోళన ఉద్యమం చేపట్టినప్పుడు వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి తరువాత పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులతో కలిసి ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దేవుని భూములు ఆలయానికి దక్కే వరకూ పోరాటం కొనసాగిస్తామని మాజీ సర్పంచి గంధం సత్యన్నారాయణ అన్నారు.

కూలేందుకు సిద్ధం

- శిథిలావస్థకు చేరిన పెద్దాపురం పోలీస్ క్వార్టర్స్
- అద్దె ఇళ్లలో ఉంటున్న పోలీసులు
- తప్పని ఇబ్బందులు



శిథిలమైన పెద్దాపురంలోని పోలీసు క్వార్టర్లు

పెద్దాపురం: ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులకు సరైన నీడలేకుండా పోతోంది. పోలీసు క్వార్టర్స్ నివాసయోగ్యంగా లేకపోవడంతో అద్దె భవనాల్లో కాలం గడుపుతున్నారు. దీంతో ఇబ్బంది పడుతున్నారు. పెద్దాపురంలోని పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడే ఉన్న ఎస్సై క్వార్టర్ మరీ దారుణంగా ఉంది. కొన్నేళ్లుగా ఎవరూ అందులో నివాసం ఉండకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

ఇదీ పరిస్థితి

పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉండే కొండయ్యపేటను ఆనుకుని పోలీసులకు 36 రక్షక భటులతోపాటు ఎస్ఐ, సీఐ క్వార్టర్స్ నిర్మించారు. అప్పట్లో ఈ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు ఈ క్వార్టర్లను కేటాయించారు. సుమారు 20 ఏళ్లుగా ఈ సముదాయానికి కనీస మరమ్మతులు కూడా చేపట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ప్రమాదభరితంగా మారాయి. ఈ ప్రమాదకంగా ఉన్నప్పటికీ గత ఏడాది వరకు రెండు క్వార్టర్లలో పోలీసు కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశాయి. చిన్న చిన్న మరమ్మతులకు సొంతంగా నిధులు ఖర్చు చేసేవారు. ప్రస్తుతం అవి కూడా శిథిలస్థితికి చేరాయి. ఈ క్వార్టర్లలో విద్యుత్ వైరింగ్ కాలిపోయి, బోర్డులు వేలాడుతున్నాయి. కిటికీ తలుపులు ఏనాడో ఊడిపోయాయి. తలుపులు కూడా రక్షణ ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాయి. గోడలకు వేసిన సిమెంట్ పూత కూడా పెచ్చులూడి పడుతున్నాయి. బాత్‌రూంలకు తలుపులు పూర్తిగా ఊడిపోయాయి. తప్పని పరిస్థితిల్లో కాపురం ఉండాల్సి వస్తోందని పోలీసు కుటుంబాలు చెబుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేనేలేదు. శిథిల భవనాల ఆవరణలో తుప్పలు పెరిగిపోయి, విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలప్పుడు మాత్రమే పోలీసులు తుప్పలు నరికి కాస్త శుభ్రం చేయడం, తిరిగి తుప్పలు పెరిగిపోవడం జరుగుతూ వస్తోంది. . క్వార్టర్లు శిథిలమైనందున వాటిస్థానే క్వార్టర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు..

సబ్ డివిజన్‌లో శిథిలస్థితిలో 165 క్వార్టర్లు

పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 165 పోలీస్ క్వార్టర్లు శిథిలస్థితికి చేరుకున్నట్లు పోలీస్ సిబ్బంది లెక్కలు చెబుతున్నారు. కిర్లంపూడి, గండేపల్లి, కోటనందూరు తొండంగి పోలీస్ స్టేషన్‌కు క్వార్టర్స్ లేవు. మిగిలిన పెద్దాపురంలో 38, తునిలో 48, ప్రత్తిపాడు 17, జగ్గంపేట 14, అన్నవరం 10, సామర్లకోట, 25. రంగంపేట 13 క్వార్టర్స్ శిథిల స్థితిలో ఉండడంతో చాలా చోట్ల పోలీస్ సిబ్బంది అద్దె భవనాల్లోనే నివశిస్తూ జీవనం సాగిస్తున్నారు.



నివాసయోగ్యంగా లేక పిచ్చితుప్పలతో ఉన్న ఎస్సై క్వార్టర్

నివాసయోగ్యంగా లేవు



పోలీసు క్వార్టర్స్ శిథిలస్థితికి చేరుకున్నాయి. గతంలో క్వార్టర్స్ నివాసయోగ్యంగా లేవని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఆర్ అండ్ బీ, పోలీసు అధికారులు క్వార్టర్స్‌ను పరిశీలించి, నివాసయోగ్యంగా లేవంటూ నిర్ధారించారు. దీనిపై నూతన భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించాం.

– మౌనిక, ఎస్సై, పెద్దాపురం

మహిళలకు అండగా ఉంటా



వంగా గీతను సత్కరిస్తున్న పచ్చిమళ్ల జ్యోతి

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి మహిళలకు అండగా ఉంటానని పచ్చిమళ్ల జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా జ్యోతి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతా విశ్వనాథ్‌ను బుధవారం కలిసి దుశ్శాలువా, పూల మాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతిని వంగా గీత అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పచ్చిమళ్ల అప్పలరాజు, గండేపల్లి బాబీ పాల్గొన్నారు.